క్లుప్తంగా

ఇల్లెందు ఎఫ్‌డీఓగా కరుణాకరాచారి

ఇల్లెందురూరల్: ఇల్లెందు ఎఫ్‌డీఓగా కరుణాకరాచారి శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇల్లెందు ఎఫ్‌డీఓగా విధులు నిర్వహించిన కర్నావత్ వెంకన్న పలు ఆరోపణల నేపథ్యంలో అటవీశాఖ ఉన్నతాధికారులు 2024 సెప్టెంబర్‌లో విధుల నుంచి తొలగించారు. నాటి నుంచి కొత్తగూడెం ఎఫ్‌డీఓ కోటేశ్వరరావుకు ఇల్లెందు ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పుడు ఇల్లెందుకు రెగ్యులర్ ఎఫ్‌డీఓగా కరుణాకరాచారి విధుల్లో చేరారు. బాధ్యతలు చేపట్టిన ఎఫ్‌డీఓకు ఎఫ్ఆర్‌ఓలు చలపతిరావు, నర్సింహారావు, డీఆర్‌ఓ వీరబాబు, అసోసియేషన్ ప్రతినిధులు కోటి, వీర్రాజు, మురళి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

అంగన్‌వాడీ నూతన భవనం ప్రారంభం


భవనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమల్ల గ్రామపంచాయతీ గంగమ్మ కాలనీలో శనివారం అంగన్‌వాడీ కేంద్ర నూతన భవనాన్ని టీం సంభవ ఫౌండేషన్ వారు ప్రారంభించారు. సీడీపీఓ లక్ష్మీప్రసన్న, ఫౌండేషన్ ప్రెసిడెంట్ సద్గురు, పురుషోత్తం, సత్యప్రసాద్, మధు, హరీష్ కుమార్, వికాస్ సింగ్, సూర్యప్రకాష్, ప్రియా, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

డిపెండెంట్ ఉద్యోగాల పక్రియను వేగవంతం చేయాలి

సింగరేణి(కొత్తగూడెం): ఏరియాలలో డిపెండెంట్ ఉద్యోగాల పక్రియను వేగవంతం చేయాలని, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు టర్మినల్ బెనిఫిట్స్ వీలైనంత త్వరలో అందజేయాలని జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ సీఎస్సార్) జీవీ కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం సింగరేణి వ్యాపిత పర్సనల్ విభాగం అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. చిన్నచిన్న తప్పిదాలతో డిపెండెంట్లను ఇబ్బందులకు గురిచేయొద్దన్నారు.

విద్యార్థికి అభినందన

జూలూరుపాడు: నవోదయ సీటు సాధించిన జూలూరుపాడు సాయి ఎక్స్‌లెంట్ స్కూల్‌కు చెందిన విద్యార్థి విశ్వసన్నిద్‌ను శనివారం తహసీల్దార్ టి.శ్రీనివాస్ అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ ఆదినారాయణ, పాఠశాల డైరెక్టర్ హుస్సేన్, కరస్పాండెంట్ కృష్ణ ప్రసాద్, ఉపాధ్యాయులు అశోక్, నరసింహారావు, తల్లిదండ్రులు గురుమూర్తి దంపతులు పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ వితరణ


డిజిటల్ టీవీని ప్రారంభిస్తున్న మంగీలాల్

టేకులపల్లి: బొమ్మనపల్లి కాంప్లెక్స్ పరిధిలోని మంగ్యా తండా ప్రాథమిక పాఠశాలకు చేతన ఫౌండేషన్ ఆర్థిక సాయంతో డిజిటల్ టీవీని వితరణగా అందజేశారు. ఈ మేరకు శనివారం కాంప్లెక్స్ హెచ్ఎం మంగీలాల్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో టీవీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీఎస్ మంగ్యా తండా హెచ్ఎం మంగీలాల్, టీచర్ వీరన్న, సీఆర్‌పీ అబ్బయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో ప్రశాంత జీవనం

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం స్కూళ్లు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, వివిధ స్వచ్ఛంద సంస్థల్లో యోగాసనాలు వేశారు. గురువులు యోగా ప్రాధాన్యతను వివరించారు. ప్రతీరోజు కొంత సమయం యోగాకు కేటాయిస్తే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, యోగా జీవితంలో అంతర్భాగం కావాలని చెప్పారు. భారతదేశంలో పుట్టిన యోగా అంతర్జాతీయంగా గుర్తించబడి, మానవాళికి ఆరోగ్యాన్ని పెంపొందిస్తోందన్నారు. యోగాని అన్ని దేశాలకు విస్తరించాలనే ఉద్దేశంతో ప్రతీ సంవత్సరం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించుకుంటున్నట్లు చెప్పారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు, అధికారుల నుంచి ఉపాధి కూలీల వరకు ఆసనాలు వేసి వాటి విలువ తెలుసుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్


సూపర్‌బజార్(కొత్తగూడెం): యోగా చేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది


సింగరేణి(కొత్తగూడెం): యోగా దినోత్సవంలో జీఎం శాలేంరాజు, తదితరులు


టేకులపల్లి: బోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..


చుంచుపల్లి: కొత్తగూడెం రేడియో స్టేషన్‌లో..


జూలూరుపాడు హైస్కూల్‌లో..


కొత్తగూడెంఅర్బన్: మెడికల్ కళాశాలలో..


ఇల్లెందురూరల్: రొంపేడు ఆశ్రమ పాఠశాలలో...


పాల్వంచ: విద్యుత్ కాలనీలో...


చుంచుపల్లి: రుద్రంపూర్ హైస్కూల్‌లో..


ఇల్లెందు: ఆసనాలు వేస్తున్న సింగరేణి జీఎం కృష్ణయ్య, ఉద్యోగులు


పాల్వంచరూరల్: యోగాసనాలు వేస్తున్న గురుకుల విద్యార్థులు

ఘనంగా ఫుడ్ ఫెస్టివల్


పాల్గొన్న మెప్మా అధికారులు, సభ్యులు

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన వంద రోజులు కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెం మెప్మా ఆధ్వర్యంలో గాజుల రాజం బస్తీలోని ఫుడ్ కోర్టులో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. వివిధ రకాల వంటకాలు, పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. పెద్ద సంఖ్యలో సంఘ సభ్యులు, మహిళలు కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రాజేష్, ఏడీఎం సి.చంద్రశేఖర్‌బాబు, మెప్మా టీఎంసీ బి.వెంకటేశ్వర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్స్ శాంతకుమార్, సరిత, మౌలాల్, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

మత్స్య సొసైటీ సభ్యుల్లో వివాదం..

సుజాతనగర్: సింగభూపాలెం చెరువు సొసైటీ సభ్యుల మధ్య వివాదాలు తలెత్తాయి. చేపపిల్లల పంపిణీ, సభ్యత్వాల జారీ, ఆదాయ వ్యయాలు, నిధుల నిర్వహణ వంటి అంశాల్లో అక్రమాలు, అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెరువుకు సంబంధించి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎగ్జిక్యూటివ్ కమిటీ ఐదేళ్లుగా అమల్లో ఉంది. ఈ కమిటీలో కోఆప్షన్ సభ్యులతో కలిపి మొత్తం 11 మంది సభ్యులు ఉండగా... మరో 400 మంది సొసైటీ సభ్యులు ఉన్నారు. కమిటీ కాల పరిమితి రెండు నెలల క్రితమే ముగిసిపోగా.. పాత కమిటీ సభ్యులే ఇంకా పెత్తనం చెలాయించడం ఏంటని సభ్యుల్లో కొందరు ప్రశ్నిస్తున్నారు. చెరువు సమీపంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కొందరు సభ్యులు పాత కమిటీపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదాయ వ్యయాలు చెప్పడం లేదని ఆరోపించారు. ప్రతీ సభ్యుడు ఏడాదంతా కాపలా ఉండాలని, పన్ను కట్టాలని, చేపల ద్వారా మూడు నెలల్లో వచ్చిన ఆదాయం రూ.30 వేలకు మించి లేదంటూ ఆరోపిస్తున్నారు. కొత్త కమిటీని ఏర్పాటు చేసి సభ్యులందరికీ సమానంగా ఆదాయం పంచాలని కోరుతున్నారు.

దోపిడీని అరికట్టాలి

సింగరేణి(కొత్తగూడెం): ప్రైవేట్ విద్యాసంస్థలు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ ఇతర విద్యాసంబంధిత వస్తువుల పేరుతో విద్యార్థుల తల్లితండ్రులను దోపిడీ చేస్తున్నారని చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హరికృష్ణ డిమాండ్ చేశారు. శనివారం కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యను వ్యాపారంగా మారుస్తున్నాయని విద్యాశాఖ స్పందించాలని కోరారు.

ఇల్లెందు/ఇల్లెందురూరల్: ఇల్లెందులో యథేచ్ఛగా పాఠ్యపుస్తకాలు అమ్మకంలో దోపిడీకి పాల్పడుతున్నారు. జీఎస్టీ పేరుతో వ్యాపారులు దందా చేస్తున్నారు. నకిలీ బిల్లులు ఇచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని, పుస్తకాల దోపిడీ నుంచి పేదలను కాపాడాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేసింది. శనివారం ఇల్లెందులో యూనియన్ ఆధ్వర్యంలో పుస్తకాల దుకాణాలలో అమ్మకాల వివరాలు సేకరించారు. అనంతరం ఎంఈఓ ఉమాశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. ఇల్లెందు పట్టణంలో ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల నుంచి పుస్తకాల పేరుతో అధిక డబ్బులు వసూలు చేస్తున్నారని, నకిలీ బిల్లులు ఇస్తున్నారని, జీఎస్టీ పేరుతో అధికంగా వసూలు చేస్తున్నట్లు చెప్పారు. సాయి, పార్థసారథి, గణేష్ పాల్గొన్నారు.


ఇల్లెందు: ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పేదలు, కార్మిక వర్గాలకు అండగా ఎర్రజెండా

జూలూరుపాడు: పేదలు, కార్మికులు, కర్షకులు, బడుగు, బలహీనవర్గాలకు ఎర్రజెండానే అండగా నిలుస్తుందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. శనివారం జూలూరుపాడు యల్లంకి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సీపీఐ మండల మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రశ్నించే కమ్యూనిస్టులపై ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్‌షా కక్ష కట్టి బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ ఆవిర్భావం నుంచి ప్రజా సమస్యలపై పోరాడుతోందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, ప్రతి పంచాయతీలో సీపీఐ ప్రాతినిధ్యం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్కే సాబీర్‌పాషా, ఎర్రబాబు, గుండెపిన్ని వెంకటేశ్వర్లు, బి.కేశవులు, నేరేళ్ల రమేష్, ఎస్కే నాగుల్‌మీరా, యల్లంకి మధు, ఎస్కే చాంద్‌పాషా, పొన్నెకంటి వెంకటేశ్వర్లు, యాసా రోశయ్య, గుండెపిన్ని మధు, సిరిపురపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బాగం హేమంతరావు

పోడు వ్యవసాయం ఆదివాసీల హక్కు


మాట్లాడుతున్న సాబీర్‌పాషా

చుంచుపల్లి: అడవులనే నమ్ముకొని పోడు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న వలస ఆదివాసీల భూములు లాక్కొని వారికి ఉపాధి లేకుండా చేయొద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా ప్రభుత్వాన్ని, అటవీశాఖ అధికారులను కోరారు. చుంచుపల్లి మండలం, పెనగడప పంచాయతీ అటవీ ప్రాంతంలోని జగ్గారం, పాలవాగు, గడ్డిగుట్ట, జగ్గారం, మర్రిగూడెంలో శనివారం అయన సందర్శించారు. జగ్గారంలో అటవీశాఖ, ఆదివాసీ కుటుంబాలతో సమావేశమయ్యారు. మాట్లాడుతూ... దశాబ్దాల క్రితం బతుకుదెరువు కోసం వలస వచ్చిన ఆదివాసీ కుటుంబాలు పెనగడప శివారులో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకొని పోడు వ్యవసాయంపై జీవిస్తున్నారని, వీరికి అటవీ హక్కుల చట్టం ప్రకారం పోడు భూములపై హక్కులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగంపై ఉందన్నారు. నీడల సుధాకర్, మన్నెం వెంకన్న, కట్టా ఉదయ్, తాజుద్దీన్, కుంచం శ్రీనివాసరావు, మూతి శ్రీనివాస్, దస్తగిరి, ఖాసీం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటికి వినతుల వెల్లువ


మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేస్తున్న మడత వెంకట్

ఇల్లెందు/ఇల్లెందు రూరల్: ఇల్లెందులో నివాస స్థలాల క్రమబద్ధీకరణ కోసం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్ వినతిపత్రం అందజేశారు. ఇల్లెందు పర్యటనకు శనివారం వచ్చిన మంత్రికి ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. 2017లో ఆనాటి ప్రభుత్వం ఇచ్చిన జీఓ 224కు అనుసంధానంగా జీఓ 373ను అమలు చేయాలని, తద్వారా ఎనిమిది వేల మందికి ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. అలాగే, కొత్త మండలాలు, ఇల్లెందు డివిజన్ ఏర్పాటు చేయాలని, సీతారామ ద్వారా గోదావరి జలాలు అందించాలని ఎన్‌డీ నాయకుడు ఆవునూరి మధు ఆధ్వర్యాన వినతిపత్రం అందజేశారు. కాగా, మంత్రి పొంగులేటి గుండాల నుంచి బయ్యారం మండలానికి కొమరారం మీదుగా వెళ్తుండగా ఆ మార్గంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో కొమరారం గ్రామ ఆదివాసం మహిళలు సుమారు రెండు గంటలపాటు వేచి ఉండి మంత్రి కాన్వాయ్‌కు అడ్డుపడడంతో మంత్రి కారు దిగొచ్చి మాట్లాడారు. 2005కు ముందే పోడు నరికి సాగు చేసుకుంటున్న భూమిని అటవీశాఖ అధికారులు లాక్కున్నందున తమకు పట్టాలు ఇప్పించాలని కోరారు. దీంతో కలెక్టర్‌కు వివరించి న్యాయం జరిగేలా చూస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

కార్పొరేషన్ ఏర్పాటుతో మరింత అభివృద్ధి

పాల్వంచ: కార్పొరేషన్ ఏర్పాటుతో మరింత అభివృద్ధికి బాటలు పడ్డాయని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం అన్నారు. శనివారం పట్టణ పరిధిలోని పిల్లవాగు సీపీఐ శాఖ మహాసభను నిర్వహించారు. మాట్లాడుతూ.. సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైన ఎర్రజెండా పార్టీకి ఎదురులేదని, నిరంతరం సమరశీల పోరాటాలు సాగిస్తున్న సీపీఐ ఒక ప్రాంతానికో, వర్గానికో పరిమితమైన పార్టీ కాదన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో అడుసుమల్లి సాయిబాబు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, బండి నాగేశ్వరరావు, రాహుల్, పద్మజ, సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సరుకుల రవాణాలో జాప్యం జరగొద్దు

పాల్వంచరూరల్: గిరిజన వసతి గృహాలకు, ఆశ్రమ పాఠశాలలకు నిత్యావసర సరుకుల పంపిణీలో జాప్యం చేయకుండా రవాణా చేయాలని గిరిజన సహకార సంస్థ డివిజనల్ అధికారి (డీఎం) సమ్మయ్య సిబ్బందిని ఆదేశించారు. స్థానిక గిరిజన సహకార సంస్థ (జీసీసీ) కార్యాలయాన్ని శనివారం డీఎం సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజన హాస్టళ్లకు సరుకులను పంపిణీ చేసే గోదామును తనిఖీ చేశారు. మేనేజర్ నర్సింహారావు, గోదాము ఇన్‌చార్జ్ శివ ఉన్నారు.

రేకుల ఇంటికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వరా..?


పూసలతండాలో ఇందిరమ్మ ఇంటి దరఖాస్తుదారుడి ఇల్లు

పాల్వంచరూరల్: ఇళ్లు లేని, పూరిపాక, రేకల ఇళ్లు ఉన్న నిరుపేద గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం లేదని దరఖాస్తుదారులు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధి కోడిపుంజుల వాగు గ్రామపంచాయతీ పూసలతండా గ్రామానికి చెందిన బాదావత్ మోహన్‌ని రేకుల ఇల్లు కావడంతో ఇందిరమ్మ ఇంటికి దరఖాస్తు పెట్టుకున్నాడు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు కూడా అర్హుడే అని నిర్ధారణ చేశారు. ఏం జరిగిందో ఏమో కానీ.. కార్యదర్శి ఇల్లు మంజూరు చేయకుండా అడ్డుకున్నాడని దరఖాస్తుదారుడు శనివారం మోహన్ ఎంపీడీఓతో మెర పెట్టుకున్నాడు. ఈ విషయమై ఎంపీడీఓ కె.విజయ భాస్కరరెడ్డిని వివరణ కోరగా... మండలంలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక పారదర్శకంగా జరిగిందని అర్హులైన ప్రతీఒక్కరికి ఇళ్ల మంజూరు జరిగిందన్నారు. మండలంలో 594 ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రతిపాదనలు పంపగా 574 ఇళ్లు మంజూరైనట్లు చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లకు, ప్రభుత్వ ఉద్యోగులకు, పక్కా ఇళ్లు ఉన్న వారు అనర్హులు అనిచెప్పారు.

తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ సార్

ఇల్లెందు: 60 ఏళ్ల తెలంగాణ ఆకాంక్షను సాధించేందుకు తన జీవితాన్ని ధారపోసిన త్యాగజీవి ప్రొఫెసర్ జయశంకర్ అని బీఆర్‌ఎస్ వ్యవస్థాపక సభ్యుడు దిండిగల రాజేందర్ అన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా ఇల్లెందులో శనివారం జగదాంబా సెంటర్‌లో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. జయశంకర్ సార్ సేవలు ఈ తెలంగాణ ప్రజలు ఏనాటికీ మర్చిపోలేరని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిలివేరు సత్యనారాయణ, పరుచూరి వెంకటేశ్వరరావు, అజ్మీరా బావుసింగ్, అబ్దుల్ నబీ, జబ్బార్, గిన్నారపు రాజేష్, హరికృష్ణ, హరిప్రసాద్ యాదవ్, చాంద్‌పాషా, మునిగంటి శివ, డేరంగుల పోషం, రామ్‌లాల్ పాసీ, లలిత్‌కుమార్ పాసీ, ఘాజీ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ 14వ వర్ధంతిని మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. 1956లో తొలిదశ ఉద్యమం నుంచే తెలంగాణ అస్తిత్వాన్ని నిలబెట్టే ప్రయత్నం చేసిన మహోన్నత వ్యక్తి జయశంకర్ సార్ అని కొనియాడారు. విద్యార్థిగా ఉద్యమ అడుగులు వేసి.. ఉపాధ్యాయుడిగా, అధ్యాపకుడిగా తన పోరాట చైతన్యాన్ని పాఠాల ద్వారా విద్యార్థులకు బోధిస్తూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమ చైతన్యాన్ని బతికించినట్లు చెప్పారు.

పాల్వంచ: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం స్థానిక బుడగం నాగేశ్వరరావు క్యాంప్ ఆఫీస్‌లో నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ... తెలంగాణ జాతిపిత, విద్యావేత్త జయశంకర్ జీవితం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసమే వ్యూహరచన చేశారన్నారు. ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో బరగడి దేవదానం, ఎస్‌డీటీ హుస్సేన్, శనగ రామచందర్‌రావు, ఆంతోటి నాగభూషణం, తాజుద్దీన్, వెంకన్న, అజీజ్, శనగ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


ఇల్లెందు: నివాళులర్పిస్తున్న దిండిగల రాజేందర్, తదితరులు


ఇల్లెందురూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నివాళులర్పిస్తున్న అధ్యాపకులు


పాల్వంచ: నివాళులర్పిస్తున్న నాయకులు

మిషన్ భగీరథ భాగ్యం కలిగేనా !

- పైపులు వేసి ఏడాది దాటినా నీటి జాడే లేదు
- పట్టించుకోని అధికారులు

టేకులపల్లి: ప్రజలకు సురక్షిత గోదావరి జలాలు అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న మిషన్ భగీరథ పథకం కొందరికి అందని ద్రాక్షలా మారింది. నిధుల లేమి, పర్యవేక్షణ లోపం కారణంగా పలు గ్రామాలు భగీరథ నీటికి నోచుకోవడం లేదు. టేకులపల్లి మండలంలో 36 గ్రామ పంచాయతీల పరిధిలో 137 గ్రామాలు ఉండగా గ్రామానికి ఒక మిషన్ భగీరథ నీటి ట్యాంకు ఏర్పాటు చేయాలనేది నిబంధన. కానీ టేకులపల్లి మండలంలో ఓవర్ హెడ్ ట్యాంకులు 103, సింథటిక్ మినీ ట్యాంకులు 23 మొత్తం 126 మాత్రమే ఉన్నాయి. మండలంలో భగీరథ పైపులైన్లు 100 కిలోమీటర్ల మేర వేశారు. ఇంకా పైపులైన్లు, ఓహెచ్‌ఆర్ ట్యాంకుల అవసరం ఉంది. నేటికీ పలు గ్రామాల్లో పైపులైన్ల లీకేజీ కారణంగా సక్రమంగా నీటి సరఫరా జరగడం లేదు. లీకేజీలకు మరమ్మతులు కూడా జాప్యం అవుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామాల్లో ట్యాంకులకు నీటి సరఫరా సకాలంలో జరగడం లేదు. కొన్నిచోట్ల వారంరోజులకోసారి ట్యాంకుకు నీటిని వదులుతున్నారు. మండలంలో ఇంకా 20కి పైగా గ్రామాల్లో పూర్తిస్థాయిలో పనులు జరగకపోవడంతో భగీరథ నీటి సరఫరా జరగడం లేదు. పంచాయతీల్లో పాలకవర్గం లేకపోవడం, నిధుల లేమి కారణంగా భగీరథ పైపుల మరమ్మతులు కార్యదర్శులకు భారంగా మారింది.


టేకులపల్లిలో సంవత్సరం క్రితం వేసిన భగీరథ పైపులు

పైపులు వేసి ఏడాది..

గత ఏడాది మార్చి – ఏప్రిల్‌లో టేకులపల్లి పంచాయతీ సీఎస్‌బీ బ్యాంకు సమీపంలో సుమారు వంద నివాసాలకు మిషన్ భగీరథ నీటి సరఫరా కోసం ఇంటింటికి పైపులు వేశారు. సంవత్సరం దాటినా అతీ గతీ లేదు.. నేటికీ చుక్క నీరు రాలేదు. ప్రతీరోజు గోదావరి జలాలు వస్తాయనే గంపెడాశతో ఎదురు చూస్తున్న జనానికి నిరాశే మిగులుతోంది. ఉన్నతాధికారులు స్పందించి టేకులపల్లి పంచాయతీలో భగీరథ నీటి సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఎదురు చూస్తున్నాం...



గత సంవత్సరం ఏప్రిల్‌లో మా వీధిలో ఇంటింటికీ మిషన్ భగీరథ పైపులు వేశారు. గోదావరి జలాలు వస్తున్నాయని ఎంతో ఆశ పడ్డాం. నేటికీ నీటి సరఫరా లేదు. వేసిన పైపులు కూడా ధ్వంసం అయ్యాయి. గోదావరి జలాలు తాగే భాగ్యం మాకు లేదేమో.. ఉన్నతాధికారులు స్పందించి భగీరథ నీటి సరఫరా చేయాలి.

– మేకల సునీత, టేకులపల్లి